నులిపురుగులను నివారిద్దాం

సత్తెనపల్లి/అమరావతి/నకరికల్లు/క్రోసూరు/ముప్పాళ్ల/రాజుపాలెం/పెదకూరపాడు : నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల వ్యాప్తంగా పాఠశాలల్లో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగింది. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మాత్రల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.శ్రీలక్ష్మి కవిత, వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ పాల్గొన్నారు.
విద్యార్థుల చేత మాత్రలు మింగించారు. మండలంలో మొత్తం 12,565 మంది విద్యార్థులు ఉండగా, 11,437 మందికి తొలిరోజు మాత్రలు పంపిణీ చేశారు. 90 శాతం పంపిణీ పూర్తయ్యింది. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జాన్సన్, ఫణిదం సీహెచ్ఓ వి.సీతారావమ్మ, ఆరోగ్య విస్తరణాధికారులు పి.వెంకట్రావు, షేక్ మహమ్మద్ ఖదీర్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, సంపూర్ణ, గణేష్, ఏఎన్ఎమ్‌ల నాగమల్లేశ్వరి, ఆశా కార్యకర్త నాగలక్ష్మి పాల్గొన్నారు.

- అమరావతి మండలం అత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగింది. డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ మంగళవారం పది వేల మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్టు వివరించారు. ఇవాళ తీసుకోని విద్యార్థులకు ఈనెల 18న అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రవిబాబు పాల్గొన్నారు.
- నకరికల్లు మండలంలో 94 శాతం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి వి.శ్రీనునాయక్ తెలిపారు. పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ ఎస్.సురేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ పరసా అంజమ్మ మాత్రల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవి, సీహెచ్ఓ కె.మల్లయ్య, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.
- క్రోసూరు మండలంలో 98శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ పూర్తయినట్టు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి తెలిపారు. మంగళవారం 12,987 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఎంపీపీ పి.కోటయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ గార్లపాటిదాసు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, ఎంఈఓ ఏసురత్నం విద్యార్థులకు మాత్రలు అందించారు.
- ముప్పాళ్ళ మండలంలో 7,216 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి మంగళవారం తెలిపారు. 94 శాతం పంపిణీ చేశామని వెల్లడించారు. ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం గ్రామాల్లో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాత్రలు మింగించారు. కార్యక్రమాల్లో వైద్యులు జయకృష్ణ, సూపర్‌వైజర్లు పీటర్‌డానియేల్, జోస్పిన్‌రాణి, భవాని కుమారి, రవిచంద్ర, ఆయా గ్రామాల ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
- రాజుపాలెం మండలంలో 8,090 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లికార్జున శర్మ, సర్పంచ్ పులిబండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.
- పెదకూరపాడు మండలంలోని 75త్యాళ్లూరు పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 8,524 మంది విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో క్రొత్తపల్లి నరశింహారావు, వైద్యాధికారి వెలుగొండా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురం బాలుర గురుకులంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న దృశ్యం ; అమరావతి బాలికల గురుకుల పాఠశాలలో..


పెదకూరపాడులో..


రాజుపాలెంలో..


నకరికల్లులో..


ముప్పాళ్ళలో..


క్రోసూరులో..

క్లుప్తంగా

మండల లీగల్ సర్వీసెస్ సభ్యునిగా సుబ్బరాయుడు



సత్తెనపల్లి: మండల లీగల్ సర్వీసెస్ సభ్యునిగా సత్తెనపల్లికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెలుగూరి సుబ్బరాయుడిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నియామకంపై పలువురు పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

5వ తరగతి, ఇంటర్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదో తరగతిలో మొత్తం 80 సీట్లు ఉండగా 60 సీట్లు ఎస్సీలకు, 5 సీట్లు ఎస్టీలకు, బీసీ–సీలకు 10సీట్లు, బీసీలకు 4 సీట్లు, ఓసీలకు ఒక్క సీటు కేటాయించినట్లు చెప్పారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీలలో మొత్తం 80 సీట్లు ఉండగా ఎస్సీలకు 60, ఎస్టీలకు 5, బీసీ 4, బీసీ–సీలకు 10, ఓసీలకు ఒక్క సీటు కేటాయించినట్లు వివరించారు. దరఖాస్తులను ఈనెల 24లోపు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 9704550072, 9866692463 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థినులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు



ముప్పాళ్ళ: గోళ్ళపాడు గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలోని ఇంటర్ విద్యార్థినులకు అభినందన అర్బన్ అండ్ నీడి సేవా సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం బహూకరించారు. విద్యార్థినులు మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సంస్థ నిర్వాహకులు కందుల సురేంద్రబాబు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మన్నం కోటేశ్వరరావు, పలుకూరి రామారావు, ఉపాధ్యాయినులు ఎం.మాధవి, ఎల్.రాజారాణి, బి.సౌజన్య, జి.జ్యోతి, ఎం.స్వాతి, టి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అహోరాత్రి మహా మృత్యుంజయ యాగం

వినుకొండ(నూజెండ్ల) : లోక కల్యాణార్థం, వైరస్‌లను పారదోలేందుకు శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని వితంరాజుపల్లిలో గల సాయి బృందావనం ఆవరణలో హిమాలయ గురూజీ చేపట్టిన 72 గంటల అహోరాత్రి మహామృత్యుంజయ యాగం దిగ్విజయంగా పూర్తయింది. చివరి రోజు మంగళవారం పూర్ణాహుతి కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, దాల్ మిల్లర్ రామడుగు కోటేశ్వరరావు, తాతా రమేష్, కొప్పురావూరి సుధాకర్, పరుచూరి సత్యనారాయణ, పెనుగొండ ఆంజనేయులు ప్రవీణ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పాన్ని పారదర్శకంగా అమలు చేయాలి

శావల్యాపురం: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లావరపు విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలు, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం నిర్వహణ అమలు తీరుపై మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో శానిటేషన్ సిబ్బంది సేకరించిన తడి, పొడి చెత్తను రోడ్లపై వేయకుండా తప్పనిసరిగా ఘన వ్యర్థాల కేంద్రాలకు తరలించాలని, శానిటేషన్ సిబ్బంది వేతనాలు సకాలంలో అందేలా పంచాయతీ కార్యదర్శులపై బాధ్యత వహించాలన్నారు. శావల్యాపురంలో జాతీయ రహదారి మార్గం వెంబడి చెత్తా చెదారం సత్వరమే తొలగించాలన్నారు. త్వరలో అన్నీ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు పోస్టులు భర్తీకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇక నుంచి గ్రామ పంచాయతీల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్స్‌లో ఇసుక మరమ్మతులకు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇంటి పన్నులు వసూలు 56.47 శాతం ఉందని ఈనెలాఖరులోగా 80 శాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. శావల్యాపురం మండలంలో 52 శాతం ఇంటి పన్నులు వసూలు చేసినట్లు చెప్పారు. పల్నాడు జిల్లాలో ఇంటి పన్నులు వసూలు చేయడంలో చివరి దశలో అచ్చంపేట మండలం ఉందన్నారు. అనంతరం శావల్యాపురంలో ఘన వ్యర్థాల కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించి పురోగతిలో ఉండేలా చూడాలన్నారు. చెత్తా సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయ మార్గాలు పెంపుదల చేయాలన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

సత్తెనపల్లి: విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని విద్యాశాఖ గుంటూరు రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) సుబ్బారావు చెప్పారు. ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీలో భాగంగా సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని 9 మండలాల కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లకు పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రధానంగా విద్యార్థులకు భాషా గణితంలో పునాది అభ్యాసనం, పాఠశాల తరగతి గది వాతావరణం, ఉపాధ్యాయిని పనితీరు, సమాచార సాంకేతిక విద్య అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపల్, కోర్స్ కో–ఆర్డినేటర్ షేక్ సుభాని, కో–ఆర్డినేటర్ ప్రసాద్, డీఆర్‌పీ రంగరాజు, షేక్ సుభాని, ఎస్డీ సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉండే కంభంపాటి సుధీర్‌బాబు (39) ద్విచక్రవాహనంపై ఉదయం ఎన్ఆర్‌టీ సెంటర్‌లో టీ తాగి తిరుగు ప్రయాణంలో గంగమ్మగుడి వద్దకు చేరుకోగానే నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ట్రావెల్ ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో సుధీర్‌బాబు ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి రవీంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా రోడ్డు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో స్థానికుల ఆగ్రహం
- స్పందించిన కౌన్సిలర్ శ్రీనివాసరావు, అధికారులు


నీరు ప్రవహించడంతో పొక్లెయిన్‌తో పనులు చేపట్టిన దృశ్యం

సత్తెనపల్లి: అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 19వ వార్డ్ సుందరయ్య కాలనీలోని శ్మశానం వద్ద కొందరు వ్యక్తులు రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు. ఈ లేఅవుట్ నుంచి రాకపోకలు సాగించేందుకు అడ్డంకిగా ఉన్న చప్టాను తొలగించి రోడ్డు వేయాలని గోనెలను కాలువ అడుగు భాగంలో ఉంచి మట్టిని పోశారు. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి నీరు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా రోడ్డు నిర్మించడం, కాలువ ప్రవాహానికి ఆటంకం సృష్టించటం సమంజసం కాదన్నారు. పొలం పనులకు వెళ్లే మహిళలకు, కూలీలకు, ఇతర వాహనాలకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, కమిషనర్ కొలిమి షమ్మి, అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు.
కొత్త చప్టా నిర్మాణానికి సుమారు రూ.25 లక్షల అవసరం ఉంటుందని, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టారు. సత్వరమే స్పందించిన కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు, అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి కోనూరు బీసీలు


వైఎస్సార్ సీపీలో చేరిన కోనూరు బీసీలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: కోనూరులో బీసీ కులాలకు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానం పలికారు. గ్రామానికి చెందిన సామ నగేష్, సామ శ్రీను, ఆర్.వెంకటేష్, శ్రీను తదితరులు తమ అనుచరులు సుమారు 30 మందితో పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ ఎన్నడూ లేనంతగా ఈ ప్రభుత్వ హయాంలో తమకు మేలు జరిగిందని, గ్రామం అభివృద్ధి బాట పట్టిందని, అందుకే పార్టీలో చేరామని వివరించారు. టీడీపీలో ఉన్నా ఒక్క నాయకుడూ తమను పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు పార్టీ కూడా చూడకుండా ఎవరి ప్రమేయం లేకుండానే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్నారని, అమ్మఒడి, రైతుభరోసా, ఆసరా, చేదోడు వంటి పథకాలతో తమకు ఆత్మస్థైర్యాన్నిచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కోనూరు మాజీ సర్పంచ్ వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ పొగెళ్ల శ్రీనివాసరావు, రావెళ్ల శ్రీధర్, మత్సా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారం అభినందనీయం

గుంటూరు ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్

శావల్యాపురం: గ్రంథాలయాల్లో పాఠకులతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల నిమిత్తం ప్రభుత్వం రూ.25 లక్షల నిధులను కేటాయించినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లాల చైర్మన్ బత్తుల దేవానంద్ వెల్లడించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయ శాఖను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాల అభ్యున్నతితో పాటు డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో 98 శాఖలు ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో అదనంగా 44, పుస్తక నిర్వహణ కేంద్రాలు 140 ఉన్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా నెల రోజుల వ్యవధిలో పాఠకులకు అవసరమైన పుస్తకాల కోసం నెలరోజుల వ్యవధిలో రూ.4 లక్షలు నిధులు వెచ్చించినట్లు చెప్పారు.
ప్రభుత్వ పరంగా దాతల సహకారంతో స్థలాలు వితరణ చేస్తే సత్వరమే ప్రభుత్వ పరంగా శావల్యాపురంలో గ్రంథాలయ భవనం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా కలెక్టరు సారథ్యంలో వినుకొండ, పిడుగురాళ్ళ పట్టణాల్లో త్వరలో స్థలాలు గుర్తిస్తామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో గ్రంథాలయాలకు సంబంధించి సేస్ బకాయి రూ.11 కోట్లు ఉన్నట్లు చెప్పారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.జాన్సీలక్ష్మీ, అధికారి గంగవరపు అర్జున్‌రావు, చెవల శ్రీరాములు ఉన్నారు.

కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట: నర్సరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా చేస్తున్న నీటి కాసుల పరీక్షలు, చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎ.భువనేశ్వరి ప్రజలను కోరారు. మంగళవారం ప్రపంచ నీటి కాసుల వ్యాధి అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు.
ఈ శిబిరంలో డాక్టర్ ఎస్.సురేష్ మాట్లాడుతూ నీటి కాసులు వలన వచ్చే నష్టాల్ని ప్రజలకి వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, కంటి వైద్యులు డాక్టర్ పాల్ చంద్రశేఖర్, డా హేమశ్రీ, సిబ్బంది మురళీ, రామకృష్ణ, గ్రేస్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో గణపవరం విద్యార్థుల సత్తా


పతకాలు సాధించిన విద్యార్థులతో గ్రాండ్ మాస్టర్ కమాల్‌బాష తదితరులు

నాదెండ్ల: ఆత్మరక్షణ విద్యల్లో విశిష్టమైన కుంగ్‌ఫూలో గణపవరం విద్యార్థులు సత్తా చాటడం అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న 21 మంది విద్యార్థులు 24 మెడల్స్ సాధించారు. వీరిలో 13 బంగారు, 11 రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 12న చిలకలూరిపేట మోడరన్ కాంప్లెక్స్‌లో జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఇంటర్‌స్టేట్ ఇంటర్నేషనల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న షణ్ముఖి, అక్షయ్, చైతన్య రెడ్డి, వైష్ణవ్‌రెడ్డి, భవాని, భృగుణేశ్, సాయిశరణ్, ధర్మతేజ, ప్రశాంత్‌రాజ్‌లు బంగారు పతకాలు సాధించగా, బాలమణికంఠ, శ్రీవిద్య, కీర్తి, అక్స, కుశలసాయి, లోకేష్, హుస్సేన్, నసీమ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ కమాల్‌బాష, ట్రైనర్ సుభాని మాట్లాడుతూ, ఈ పోటీల్లో చిన్నారులు కష్టపడి నేర్చుకుని పతకాలు సాధించారన్నారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ


ప్రతిభ చూపిన క్రీడాకారులతో పసుపులేటి సురేష్ తదితరులు

సత్తెనపల్లి:రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పల్నాడు జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ నెల 11 నుంచి 12 వరకు అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పల్నాడు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు పాల్గొనగా ఇరువురు ప్రతిభ కనబరిచారు. సీనియర్స్ 83 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ నజీర్ బంగారు పతకాన్ని, 120 కేజీల విభాగంలో గురజాలకు చెందిన కత్తి జ్యోతి బాబు సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మంగళవారం నిర్వహించిన అభినందన సభలో పవర్‌లిఫ్టింగ్ పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్ మాట్లాడుతూ జాతీయస్థాయిలోనూ పతకాలను సాధించి పల్నాడు జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ జిమ్ము రాజు, గుజ్జర్లపూడి ఆనంద్, జీ రమేష్, ఎస్ మణిరత్నం, టీ.శంకర్, ఎమ్.మదన్, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్, పసుపులేటి అశోక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల నుంచి డ్రోన్లతో సర్వే


వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళ: మండలంలో మార్చి నెలాఖరు నాటికి జగనన్న భూహక్కు, భూరక్ష రీ సర్వేలో భాగంగా ఎఫ్‌పీఓఎల్ఆర్ పనులు పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లుతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వచ్చే నెల నుంచి గ్రామాల్లో డ్రోన్లతో సర్వే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు 84 శాతం పూర్తయిందని వివరించారు. వందశాతం పూర్తి చేయాలన్నారు. సచివాలయాల ద్వారా అందిన అర్జీలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ ఏడుకొండలు, ఇన్‌చార్జ్ ఆర్ఐలు కపిల్‌దేవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నీటి కాసులను నిర్లక్ష్యం చేయొద్దు



అమరావతి: దృష్టిలోపాలపై అప్రమత్తంగా ఉండాలని, కంటిలో వచ్చే నీటికాసులు(గ్లకోమా)ను నిర్లక్ష్యం చేయొద్దని మండల కంటి వైద్యాధికారి సుబ్బారావు చెప్పారు. మార్చి 12న ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా నాలుగు రోజుల నుంచి మండల పరిధిలోని సచివాలయాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం అమరావతి–2 సచివాలయంలో రోగులకు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. సుబ్బారావు మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన వారికి, ధూమపానం చేసేవారికి గ్లకోమా వచ్చే అవకాశం ఉందన్నారు. మంచి ఆహారం తీసుకోవటం ద్వారా నీటికాసులను నివారించవచ్చునన్నారు. వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సల ద్వారా కంటి చూపును రక్షించుకోవచ్చునని పేర్కొన్నారు. అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కంటి సమస్యలకు ఉచితంగా వైద్యం, మందులు అందిస్తామని వివరించారు.

ఏఎంసీ చైర్మన్ సాంబిరెడ్డికి పౌర సన్మానం



పెదకూరపాడు: క్రోసూరు మార్కెట్ యార్డుకు కొత్తగా నియమితులైన చైర్మన్ ఈదా సాంబిరెడ్డికి 75 త్యాళ్లూరు గ్రామస్తులు మంగళవారం పౌరసన్మానం చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు మాట్లాడుతూ ప్రజాసేవకే అంకితమైన సాంబిరెడ్డి, ఎంపీపీగా, గ్రామ సర్పంచ్‌గా ప్రజల మన్ననలను పొందారని పేర్కొన్నారు. రైతులకు మేలైన సౌకర్యాలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో చొరవ చూపాలని కోరారు. ముందుగా గ్రామస్తులు సాంబిరెడ్డిని దుశ్శాలువాలు, జ్ఞాపికలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కల్లి శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు క్షమారాణి తదితరులు పాల్గొన్నారు.